## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆమనగల్లు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి, పోలెపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలోని రైతులు, వ్యాపారులు, విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.




కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తించే ఓ ఉద్యోగి తీరు పలువురిని విస్మయానికి గురి చేసింది. శుక్రవారం తన ఎలక్ట్రిక్ స్కూటర్‌కు కలెక్టరేట్‌లో చార్జింగ్ పెట్టి ప్రభుత్వ సంపదకు గండి కొట్టడంపై విమర్శలు వస్తున్నాయి. సొంత అవసరాలకు ఇలా ప్రభుత్వ కార్యాలయాలను ఉపయోగించుకోవడం తగదని కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా జరగడం మొదటిసారి కాదు.. ఉద్యోగులు పలుమార్లు ఈవీ బైకులకు చార్జింగ్‌లు పెట్టుకోవడం ఇక్కడ పరిపాటిగా మారింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా





మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ

## కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందుదొందే

- ఆ పార్టీల నాయకులు చేసిన అభివృద్ధి శూన్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ

యాచారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని, ఈ పార్టీ పాలకులు పేదలకు చేసిందేమీలేదని, లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారే కానీ.. అభివృద్ధి పనులు చేపట్టడంలో విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం యాచారంలో నిర్వహించిన పార్టీ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఉద్యోగాల భర్తీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని కార్మికులు ఉద్యమాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని, రుణమాఫీ మొక్కుబడిగా చేశారన్నారు. విద్య, వైద్య రంగాలు వ్యాపారంగా మారాయని విమర్శించారు. నిరుపేద రైతులకు రూ.1500 సాయం, రూ.12 వేల దళిత బంధు, సెంటు భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఏటా రూ.12వేల సాయం ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, పగడాల యాదయ్య, పి.బ్రహ్మయ్య, చందూనాయక్, అంజయ్య, డి. జగదీష్, అలంపల్లి జంగయ్య తదితరులున్నారు.



# ఫ్యూచర్ సిటీ పరుగులు!

## ప్రత్యేక అథారిటీ ఏర్పాటుకు కసరత్తు

నగర శివారులో ప్రభుత్వం కొత్తగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్ సిటీని పట్టాలు ఎక్కించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా వారం రోజుల్లో ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. స్వయం ప్రతిపత్తి కలిగిన అథారిటీ ద్వారా ఫ్యూచర్ సిటీ పనులు వేగవంతంగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి పాలకవర్గంతో పాటు ఎగ్జిక్యూటివ్ బాడీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ అథారిటీ ఏర్పాటు కాగానే భూసేకరణ, నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి.

- పాలకవర్గంలోకి కీలక నేతలకు అవకాశం
- కొత్త సిటీ పరిధిలో మాస్టర్ ప్లాన్
- ప్రభుత్వ భూముల వినియోగానికి ఏర్పాట్లు
- తొలుత చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం ఏర్పాటు చేసే అథార్టీలో కొందరు కీలక రాజకీయ నేతలకు పునరావాసం కల్పించనున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో పరపతి కలిగిన ఒకరిద్దరు కీలక నేతలతో పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తూ ఇప్పటి వరకు అవకాశాలు దొరకని రాష్ట్రంలో పేరున్న నేతలను కూడా అథార్టీ పాలకవర్గంలోకి తీసుకోనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఫ్యూచర్‌సిటీ కోసం ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ కూడా రూపొందిస్తున్నట్లు తెలిసింది. దీని ప్రకారమే ఫ్యూచర్ సిటీలో నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటుంది. మాస్టర్ ప్లాన్‌లో కొంత భూభాగంలో అంక్షలు ఉండే అవకాశం ఉన్నా.. మిగతా దాంట్లో నిర్మాణాలకు అనుకూలంగా



ఉండే విధంగా చూస్తున్నట్లు తెలిసింది. ఫ్యూచర్ సిటీని మరింత విస్తరించాలని భావిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు అందుబాటులో ఉన్న భూమి కంటే దాదాపు రెట్టింపు భూమి అంటే 30వేలకుపైగా ఎకరాలను వివిధ మార్గాల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది. ఫ్యూచర్ సిటీ కోసం ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ భూములన్నీ అప్పట్లో ఫార్మా సిటీ ఏర్పాటు కోసం సేకరించడంతో

మిగతా 7వ పేజీలో...

## సీఎం నోట తిమ్మాపూర్ మాట

- భూ కుంభకోణాన్ని ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి
- ఇటీవలే వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): తిమ్మాపూర్ భూదాన భూముల కుంభకోణం వ్యవహారం అసెంబ్లీని తాకింది. భూదాన భూముల కుంభకోణాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. కుంభకోణానికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టినట్లు వెల్లడించారు. నగర శివార్లలోని కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో రూ.200కోట్ల విలువైన 40 ఎకరాల భూదాన భూములు అన్యాక్రాంతంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఎన్నికలకు ముందు బడానేతలు బినామీలను అడ్డుపెట్టుకుని భూదాన భూములను దొడ్డిదారిన పట్టా భూములుగా మార్చిన వైనంపై అక్టోబర్ 28న 'నాయకుల భూదాహం.. అధికారుల భూదానం' శీర్షికతో ప్రచురితమైన కథనం కలకలం రేకెత్తించింది. ఈ కథనంపై ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణకు ఆదేశించి దీనికి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసింది. శుక్రవారం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సైతం దీన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తరువాత అనేక అక్రమాలు, భూకుంభకోణాలు జరిగాయని తిమ్మాపూర్ భూదాన భూములను కూడా రికార్డులను తారుమారు చేసి అన్యాక్రాంతం చేశారన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్వగ్రామమైన తిమ్మాపూర్‌లోనే ఇది జరిగిందని స్వయంగా కేంద్ర మంత్రి ఫిర్యాదు చేసినా కూడా విలువైన భూములను పరాధీనం చేశారని తెలిపారు. ఈ విషయం తన దృష్టికి రాగానే విచారణ జరిపించి కారకులైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టించానన్నారు. అలాగే గతంలో 'ఆంధ్రజ్యోతి ' ప్రచురించిన పొక్కాల్‌గూడ భూముల కుంభకోణం విషయం కూడా సీఎం ప్రస్తావించారు. వీటన్నింటిపై విచారించి తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు.




అక్టోబర్ 28న తిమ్మాపూర్ భూములపై ప్రచురితమైన కథనం

## అవమానంతో వ్యక్తి ఆత్మహత్య

న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆందోళన



మల్లేష్(ఫైల్)

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అవమానం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామానికి చెందిన మల్లేష్(42) అజీజ్‌నగర్ రెవెన్యూలోని ఆర్గానిక్ సోలార్ విల్లాలో ఉండే జైపూర్‌కు చెందిన మేఘవి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పది రోజుల క్రితం సదరు యజమాని ఇంట్లో నగదు చోరీకి గురైంది. ఈ ఘటనపై ఆమె మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు మల్లేష్‌ను రెండుసార్లు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. మనస్తాపానికి గురైన మల్లేష్ శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంటి యజమాని ఆరోపణలతోనే మల్లేష్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీస్ స్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## క్రిస్మస్ సందడి

క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ పండగ సందడి మొదలైంది. వేడుకల సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ తాత బొమ్మలను ఏర్పాటు చేశారు. మిరుమిట్లుగొల్పుతున్న వీటిని చూసి ప్రయాణికులు సంబురపడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా



కంచె లేక ప్రాణాలు హరీ! 8

నెల రోజుల్లోనే రెండు ప్రమాదాలు

నిర్లక్ష్యంలో విద్యుత్ అధికారులు



'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం 7

ధరణితో బీఆర్ఎస్ దందాలు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



# ధ్యానానికి వేళాయె..

## నేటి నుంచి ధ్యాన మహాయాగం-3 వేడుకలు ప్రారంభం

- మహేశ్వరం పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు
- వేడుకలను ప్రారంభించనున్న ఎంపీ మల్లు రవి



సామూహిక ధ్యానం కోసం ముస్తాబైన సరస్వతి ప్రాంగణం

కడ్తాల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి ): మహేశ్వర మహా పిరమిడ్ ధ్యాన మహాయాగం -3 వేడుకలకు ముస్తాబైంది. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్ స్పిర్చ్యువల్ మూమెంట్ ఆఫ్ ఇండియా, పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. 21 నుంచి 31వ తేదీ వరకు పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు కొనసాగనున్నాయి. ఈ వేడుకలను శనివారం సాయంత్రం 5 గంటలకు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ప్రారంభిస్తారని పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కొర్పోలు విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ వేడుకలకు దేశ, విదేశాల నుంచి ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మిక వేత్తలు రానున్నారని చెప్పారు. ధ్యానులకు ఉచిత భోజన వసతి కల్పించారు. పిరమిడ్‌లోని సరస్వతి ప్రాంగణంలో 30 వేల మంది సామూహిక ధ్యానం చేసుకునేలా వేదికను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 5గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సంగీత విద్వాంసులచే అఖండ ధ్యానం, పత్రీజీ ధ్యాన వీడియో సందేశాలు, సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వేడుకల ఏర్పాట్లను శుక్రవారం ట్రస్ట్ సభ్యులతో కలిసి విజయభాస్కర్‌రెడ్డి, పిరమిడ్ కో-ఆర్డినేటర్ మాధవి పరిశీలించారు.

## గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం నాగిరెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతంగా ఉంటే ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లె గ్రామ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, మనోహర్, మాధవ్, నర్సింహ, కిషన్‌నాయక్, కృష్ణానాయక్, చెన్నారెడ్డి, సురేందర్‌చారి, యాదయ్య, రాజు, రాజేష్, శివారెడ్డి, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

## కళ్లకు గంతలు కట్టుకొని... సమస్యలు పరిష్కరించాలని

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. 14 రోజు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై కూర్చుని కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యాదయ్య, సీఐటీయూ రాష్ట్ర సెక్రటరీ పద్మ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు జీవిత బీమా, ఆరోగ్య భద్రత కల్పించాలని, ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పదవీరమణ పొందిన వారికి బెనిఫిట్స్ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజీజ్, సంపత్, సాయికుమార్, శ్రీలత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

# మండల కేంద్రంగా ప్రకటించే వరకూ పోరాటం



భిక్షాటన కార్యక్రమంలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చి చెప్పారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శుక్రవారం 50వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువజన సంఘాల సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీబావంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటు కోసం ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ జేఏసీ ఛైర్మన్ మొకురాల అశోక్‌గౌడ్, వైస్ ఛైర్మన్ లు ఏదుల శరత్ చంద్ర, ఆంజనేయులు గౌడ్, కార్యదర్శి అనిల్‌ల ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు జోలె పట్టి దుకాణాలు, హోటళ్లలో భిక్షాటన చేశారు. రిలే దీక్షల్లో నాయకులు వెంకటయ్య, సాయికుమార్, సాయిబాబా, ఆంజనేయులు, సురేశ్, తదితరులున్నారు.

# ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ


యాచారం : పడిపూజలో అయ్యప్ప స్వామి దీక్షాధారులు, భక్తులు


చేవెళ్ల : ముడిమ్యాల్‌లో నిర్వహించిన పూజలో ప్రతాప్‌రెడ్డి, తదితరులు

యాచారం/చేవెళ్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రం అయ్యప్పస్వామి నామస్మరణతో మారుమోగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది భక్తులు, దీక్షాపరులు పూజలో పాల్గొన్నారు. చందర్‌నాయర్, కె.బాషా స్వామిల పర్యవేక్షణలో దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని స్వామికి పూజలు చేశారు. ఇరుముడి కట్టుకున్న దీక్షాపరులు వేంకటేశ్వర స్వామి గుట్ట నుంచి గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు పాదయాత్రగా తరలి ఆలయంలో పూజలు చేసి ఇరుముడి ఎత్తుకొని శబరి యాత్రకు బయల్దేరారు. చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ గ్రామంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ ఛైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతంతో అభిషేకాలు, అన్నిరకాల పూలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు పూజలు చేశారు. అయ్యప్ప నామస్మరణతో గ్రామం మారుమోగింది. ఈ కార్యక్రమం అనంతరం వందలాదిగా తరలివచ్చిన స్వాములకు, వివిధ గ్రామల ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అయ్యప్పస్వాములు, భక్తులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రూ.28లక్షలతో అభివృద్ధి పనులకు ఆమోదం

కీసర రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తున్నట్లు ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దశలవారీగా ప్రాధాన్యతా పరంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు తెలిపారు. కీసరలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాలకు భగీరథ పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.5లక్షలు, లైట్ల మరమ్మతుకు రూ.5లక్షలతో పాటు పలు పనులు చేపట్టేందుకు దాదాపు రూ.28లక్షలు కేటాయిస్తూ, కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి


పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

నందిగామ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించి డిసెంబరు 26తో 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. నందిగామ మండల కేంద్రంలో శుక్రవారం శత వార్షికోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్ నాయకులతో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు. ఈమేరకు శత వసంతోత్సవాల సందర్భంగా వాడవాడలా పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, మండల కార్యదర్శి గడ్డం జంగయ్య, కొత్తూర్ మండల కార్యదర్శి ఎండీ ఖలీల్, లక్ష్మయ్య, అజ్మత్, మైసయ్య, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి చనిపోయి దినవారం కాలేదని
# చిన్నారిని బయటకు పంపిన అంగన్‌వాడీ టీచర్

నవాబుపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి చనిపోయి దినవారం కాలేదని అంగన్‌వాడీకి హాజరైన చిన్నారిని టీచర్ బయటకు పంపించింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని గంగ్యాడ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఉపన్యాసకుడు ఉపేందర్ రెడ్డి కూతురు శాన్విక శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా వారి కులంలోని వ్యక్తి చనిపోయాడని, సుష్టి ఉంటుందని అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి విద్యార్థినిని బయటకు పంపించింది. ఈ విషయంపై తండ్రి ఉపేందర్‌రెడ్డి టీచర్‌ను ప్రశ్నించగా ఆయనకు కూడా అదే సమాధానం ఇచ్చింది. దీంతో బాధితుడు ఈ విషయాన్ని విలేకరులతో తెలిపాడు. ప్రస్తుత సమాజంలోనూ ఇలా చేయడం మూఢనమ్మకాలను బలపరచడమేనని వాపోయాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

## కలెక్టరేట్‌లో శకటాల ప్రదర్శనకు స్థల సర్వే


కలెక్టరేట్ ముందు స్థలాన్ని సర్వే చేస్తున్న అధికారులు

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు గాను కలెక్టరేట్ ప్రాంగణంలో ఖాళీ స్థలాన్ని సర్వే చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం అధికారులు స్థలాన్ని సర్వే చేశారు. జిల్లాలు ఏర్పడక ముందు ప్రతీయేటా గణతంత్ర దినోత్సవాన్ని గచ్చిబౌలిలోని స్టేడియంలో నిర్వహించేవారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా కలెక్టరేట్‌ను కొంగర కలాన్‌లో నిర్మించారు. అప్పటి నుంచి అక్కడే గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చిన్న స్థలంలో ఇరుకుగా నిర్వహిస్తుండంతో శకటాల ప్రదర్శన లేకుండా పోయింది. ఈ సారి గణతంత్ర దినోత్సవంలో శకటాల ప్రదర్శనతో పాటు స్టాల్స్, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేలా కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం కావాల్సిన స్థలాన్ని సర్వే చేస్తున్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేయాలి


చెక్కులు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగిన వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు సతీష్, శివ, ఇస్మాయిల్, యాదగిరి, సాయి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి


పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ హేమలత

మహేశ్వరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని, ఇందుకోసం ప్రతీ ఒక్కరు సహకరించాలని తుక్కుగూడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ హేమలత రాజు తెలిపారు. శుక్రవారం దేవేందర్‌నగర్ కాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమ మాట్లాడుతూ హైదరాబాద్‌కు అతి చేరువలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకవర్గం సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బొంరాస్‌పేట్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ సూచించారు. మెట్లకుంటలో శుక్రవారం నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. పేదలకు అన్యాయం జరగకుండా సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ప్రజాపాలనలో అందించిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటి సర్వేను సమగ్రంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకన్నగౌడ్, పంచాయతీ కార్యదర్శి సిద్దు తదితరులు ఉన్నారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో భాగంగా కొన్ని ఇళ్ల వద్ద సిగ్నల్ రాక ఇబ్బందులు తప్పడం లేదని పంచాయతీ సిబ్బంది వాపోయారు.ఒక్కో రోజు 50 నుంచి 60 ఇళ్లు సర్వే చేయాల్సి ఉండగా 20ఇళ్లు కూడా పూర్తి కావడం లేదని పంచాయతీ సిబ్బంది తెలిపారు. సర్వేలో సడలింపు ఇవ్వాలని సిబ్బంది కోరుతున్నారు.

## మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కలిసిన ఘట్‌కేసర్ రైతులు


మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కొంతం అంజిరెడ్డి, రైతులు

ఘట్‌కేసర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగావ్యవసాయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన డైమండ్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును ఘట్‌కేసర్ మండల రైతుబంధు కమిటీ మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధానంగా కూరగాయలను సాగు చేస్తున్న రైతులకు మార్కెట్ సదుపాయంతో పాటు ప్రభుత్వం నుంచి సబ్సిడీపై విత్తనాలను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహరెడ్డి, శ్రీనివాస రాజు, పెంటారెడ్డి పాల్గొన్నారు.

## ఫస్ట్ సౌత్ జోన్ టీ-20 క్రికెట్‌లో విద్యార్థి ప్రతిభ


కప్ అందుకుంటున్న మహ్మద్ అయాన్

తాండూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలో జరిగిన ఫస్ట్ సౌత్‌జోన్ టీ-20 క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024లో తాండూరు మండలంలోని పాఠశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్‌లోని కొంపల్లి ఫైన్‌బ్యాక్ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం ఫస్ట్ సౌత్‌జోన్ టీ-20 అండర్-14 విభాగంలో క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని అల్మాస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 8వ తరగతి చదు వుతున్న మహ్మద్ అయాన్ జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ బౌలర్‌గా టైటిల్‌ను దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అల్మాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్లు మౌలానా మహ్మద్ అబ్దుల్లా అజ్హర్‌ఖాస్మీ, మౌలానా అబ్దుల్ రహ్మాన్ అథర్ ఖాస్మీలు మహ్మద్ అయాన్‌ను అభినందించారు.

## నష్టపరిహారం అందించాకే పనులు చేపట్టాలి


మాట్లాడుతున్న అప్పాయిపల్లి రైతులు

కొడంగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మంజూరు చేసిన మెడికల్, వెటర్నరీ కళాశాలల పనులను పూర్తి స్థాయిలో పరిహారం అందించిన తర్వాతే చేపట్టాలని అప్పాయిపల్లి సర్వే నెం.19లో గల రైతులు కోరారు. మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో మెడికల్, వెటర్నరీ కళాశాలల నిర్మాణానికి 60 ఎకరాల భూమిని రైతుల నుంచి ప్రభుత్వం సేకరించింది. వారికి ఎకరాకు రూ.10 లక్షలు, 125 గజాల ఇళ్ల స్థలం, ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు హామీ ఇచ్చింది. ఈ క్రమంలో ఇప్పటికే ఎకరాకు రూ.10 లక్షలు అందించగా 125 గజాల ఇంటి స్థలం పట్టాలు అందించేందుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం కళాశాలల నిర్మాణానికి సర్వే చేస్తుండగా అప్పాయిపల్లి రైతులు పలువురు పూర్తి స్థాయిలో పరిహారం అందించిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కోసం రావాలని అధికారులు కోరినా కొందరు రైతులు పరిహారం పూర్తిస్థాయిలో అందించిన తర్వాత పట్టాలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ప్రభుత్వ హామీ మేరకు పరిహారం, ఇంటి స్థలాలు అందించి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు.

## గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక


శ్రీనివాస ప్రభాకర్

శామీర్‌పేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ నూతన అధ్యక్షుడిగా శామీర్‌పేట మండలం లాల్‌గడి మలకపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన హెచ్‌ఎం ఎంవీ. శ్రీనివాసప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆ సంఘం నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం కార్యదర్శి గిరిధర్, ట్రెజరర్ తూకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి


స్పోర్ట్స్ పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులకు పరిమితం కాకుండా ఆటల పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఆర్‌జీఐ డైరెక్టర్ శాలిని అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఫర్ ఉమేన్స్(యూజీసీ)లో శుక్రవారం రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఆర్‌జీఐ డైరెక్టర్ శాలిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మార్షల్ ఆర్ట్స్ క్వీన్ ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రాతో అతలాకుతలం



**రియల్‌ఎస్టేట్ కుప్పకూలింది ▸▸ అసెంబ్లీలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి**

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్ణయాలతో మేడ్చల్ నియోజకవర్గంలో అంతా ఆగం ఆగం.. అతలాకుతలమవుతోందని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్‌లో అంతా అయోమయం.. ఆగం ఆగంగా ఉందని, మేడ్చల్ నియోజకవర్గంలో ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు, 61 గ్రామపంచాయతీలుండగా నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని ఆరోపించారు. 28 గ్రామాలను మున్సిపాలిటీల్లో కలిపివేశారన్నారు. మున్సిపాలిటీలను కూడా జీహెచ్‌ఎంసీలో కలుపుతామంటున్నారని, మేడ్చల్‌లో తన హయాంలో 444మంది లీడర్లుగా ఎదిగారని, వారంతా నేడు మటాష్ అయ్యారంటూ తనదైన శైలిలో చెప్పుకొచ్చారు. పంచాయతీలు, మున్సిపల్ ఎన్నికలు వస్తాయని ఆశపడ్డారని వారిఆశలు ఆవిరయ్యాయన్నారు. జీహెచ్ఎంసీలో కలిపితే పన్నులు పెరిగే అవకాశం ఉందని, మున్సిపాలిటీలను మున్సిపాలిటీలుగానే ఉంచాలని మంత్రి శ్రీధర్‌బాబు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని మల్లారెడ్డి కోరారు. దేశంలోనే ఐటీరంగంలో, అభివృద్ధిలో నంబర్ వన్‌గా ఉన్న హైద్రాబాద్ హైడ్రాతో హడలిపోయిందన్నారు. హైడ్రా వచ్చాక ఒక్కసారిగా రియల్‌ఎస్టేట్ భయాందోళనలతో కుప్పకూలిందన్నారు. హైద్రాబాద్‌కు హైడ్రాతో దిష్టి తగిలిందన్నారు. తనకు పెద్దఎత్తున భూములు, విద్యాసంస్థలు ఉన్నాయని, తానేమి ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో లేనని అమెజాన్, గూగుల్ వంటి ప్రఖ్యాత సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చిన ఘనత కేటీఆర్‌దేనని చెప్పుకొచ్చారు. హైడ్రాతో పెద్దపెద్ద వాళ్ల గుండెలు గుభేల్ మన్నాయని, పేదల గుండెలు పగిలిపోయాయన్నారు. హడావుడిగా కూల్చివేతలు చేయవద్దని, నోటీసులు ఇచ్చి బాధితులకు న్యాయం చేసిన తర్వాత కూల్చివేతలు చేయాలన్నారు. వీటన్నిటిపై ప్రభుత్వం ఆలోచన చేసి ముందుకుపోవాలని ఎమ్మెల్యే మల్లారెడ్డి అసెంబ్లీలో కోరారు.

## ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా

**టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**


సుంకిరెడ్డిని సన్మానిస్తున్న వెల్జాల గ్రామ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తనవంతు తోడ్పాటునందిస్తానని ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. విద్య వైద్య, ఉపాధి కల్పన, కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయమని అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ నాయకులు శుక్రవారం టాస్క్ రాఘవేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని టాస్క్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. వెల్జాలలోని శ్రీ వేద్రాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ ద్వారా తోడ్పాటునందించాలని కోరారు. రాఘవేందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి త్వరలో ఆలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, నాయకులు అంజయ్య గౌడ్, అజీజ్, అశోక్, రాజు, తదితరుల ఉన్నారు.

# ‘భూ భారతి’తో సమస్యలు పరిష్కారం

- ▸▸ ధరణి పోర్టల్‌తో బీఆర్‌ఎస్ దందాలు
- ▸▸ రియల్టర్లు పారదర్శకంగా ఉండాలి
- ▸▸ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'భూ భారతి'ని తీసుకువచ్చిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఆయన మాట్లాడుతూ మేధావుల అభిప్రాయంతో తీసుకువచ్చిన భూ భారతితో ధరణి పీడ విరుగుడయ్యిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో తప్పిదాల వల్ల సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారని అన్నారు. ఇక ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే అప్పీల్ చేసుకునే అవకాశం భూ భారతిలో ఉంటుందన్నారు. ధరణిని అడ్డం పెట్టుకొని బీఆర్‌ఎస్ నాయకులు భూ దందాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్ గ్రామ స్థాయి కార్యకర్త నుంచి ఎమ్మెల్యే వరకు పేదల భూములను కొల్లగొట్టారని అన్నారు. 2014కు ముందు 2023 తరువాత బీఆర్‌ఎస్ నాయకుల ఆస్తులను చూస్తే ఈ విషయం తెలిసిపోతుందన్నారు. అలాగే పట్టా ఒక చోట, కాస్తు మరోచోట ఉండడంతో రైతులు సమస్యలకు గురవుతున్నారని, వాటన్నింటినీ పరిష్కరించడానికి రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే చేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని రియాల్టర్లు నీతి, నిజాయితీతో ఉంటూ చట్టబద్ధంగా వ్యాపారం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల జోలికొచ్చిన, చట్ట విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను నీతి, నిజాయితీతో ఉంటున్నానని, రియల్టర్లు, అధికారులు సైతం అలాగే వ్యవహరించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై విచారణ చేసి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎ.కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.


బిహార్ సర్పంచ్‌లతో లక్ష్మీనర్సింహారెడ్డి

## పల్లె ప్రగతి పనులు భేష్

**బిహార్ సర్పంచ్‌ల బృందం కితాబు**

కడ్తాల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళికలు అభినందనీయమని, పల్లె ప్రగతి కార్యక్రమాలు బాగున్నాయని బిహార్ రాష్ట్ర సర్పంచ్‌ల బృందం కితాబు ఇచ్చినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని బృందం కొనియాడినట్లు చెప్పారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీపీఆర్‌లో శుక్రవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి వచ్చిన బిహార్ సర్పంచ్‌ల బృందంతో లక్ష్మీనర్సింహారెడ్డి సమావేశమయ్యారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను బృందం సభ్యులకు వివరించినట్లు ఆయన తెలిపారు. సమష్టి నిర్ణయాల కారణంగానే గ్రామాలు అభివృద్ధి చెందినట్లు భావిస్తున్నామని వారు తెలిపినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ అరుణ్ రాజ్, సిక్కిం జీపీల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ పరుగులు!

(5వ పేజీ తరువాయి)

న్యాయపరమైన చిక్కులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం దీనికి అదనంగా మరో 15వేలకుపైగా ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని తొలుత భావించింది. అయితే దీని చుట్టుపక్కల కొంత ప్రభుత్వ భూములు కూడా అందుబాటులో ఉండడంతో పరిమితంగానే భూసేకరణ చేయాలని నిర్ణయించింది. ఇటీవల లగచర్లలో భూసేకరణపై రాద్ధాంతం జరిగిన దరిమిలా ప్రభుత్వం భూసేకరణ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తోంది. భూములు ఇచ్చేందుకు రైతులు స్వయంగా ముందుకు వస్తే వారి అంగీకారంతో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఈ భూసేకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

### తొలుత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం

ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్మిస్తున్న 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులను ముందుగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఫ్యూచర్ సిటీ నిర్మాణాలు ఊపందుకుంటాయని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగు రోడ్డు నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రీజినల్ రింగు రోడ్డు వరకు 41.5కి.మీ మేర నిర్మిస్తున్న 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులను ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ మొదలు పెట్టింది. తొలి విడత రావిర్యాలలోని ఔటర్ రింగురోడ్డు ఎగ్జిట్ 13 నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం దాదాపు 450 ఎకరాల భూసేకరణకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంటే మెట్రో రైలు నిర్మాణం కూడా చేపడుతోంది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ పనులు కూడా పూర్తయ్యాయి. రెండో విడత స్కిల్ యూనివర్సిటీ నుంచి రీజినల్ రింగురోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూసేకరణ నోటిఫికేషన్ త్వరలో ఇవ్వనున్నారు. రెండో విడత భూసేకరణలో దాదాపు 500 ఎకరాల వరకు సేకరిస్తున్నారు.

## అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలు జరిపితే చర్యలు


నాపరాళ్ల గనుల్లో పనులను నిలిపివేస్తున్న ఆర్‌ఐ నాగార్జున్‌రెడ్డి

బషీరాబాద్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాపరాళ్లను తవ్వి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగర్జున్ రెడ్డి అన్నారు. బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ ఆదేశానుసారం మండలంలోని జీవన్గి, కొర్విచెడ్, నవాల్గ ప్రాంతల్లోని గనులను శుక్రవారం ఆర్‌ఐ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేపట్టారు. అక్కడక్కడా నాపరాళ్ల తవ్వకాలు జరుపుతుండటంతో పనులను నిలిపివేశారు. అనంతరం గనుల యజమానులతో లీజులు తీసుకుని నాపరాళ్ల తవ్వకాలు జరుపాలని సూచించారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే ఎవరినైనా సరే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. నాపరాళ్లను లారీల్లో తరలిస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. రోజూ గనుల్లో పర్యటించి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ బిచ్చప్ప ఉన్నారు.

### ఖనిజ సంపద రక్షణకు టాస్క్‌ఫోర్స్ టీం

అక్రమ నాపరాళ్ల తవ్వకాలు, ఖనిజ సంపద అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ అన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ఇకపై అక్రమ మైనింగ్, ఇసుక, మట్టి తవ్వకాలపై టాస్క్‌ఫోర్స్ టీం ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. కలెక్టర్ నేతృత్వంలో మండల స్థాయి టీం పనిచేస్తుందని, రెవెన్యూ, పోలీస్, మైన్స్, ట్రాన్స్‌పోర్టు, ఫారెస్ట్ డిపార్టుమెంట్ అధికారులు ఉంటారన్నారు. ఈ టీం అక్రమ మైనింగ్, ఖనిజ సంపదను రవాణాను అడ్డుకునేందుకు నిత్యం పర్యవేక్షిస్తుందని ఆయన వివరించారు.

## మున్సిపాలిటీ ఏర్పాటును విరమించుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న అనంతరెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మండలంలోని ఏడు గ్రామాలను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. ఈ ప్రాంతం మున్సిపాలిటీ ఏర్పాటు ద్వారా లాభం కన్నా నష్టమే ఎక్కువన్నారు. శుక్రవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం 111 జీవోను తొలగించి 69 జీవోను అమలులోకి తీసుకువచ్చిందని.. దానిని అమలు చేయకుండా మున్సిపాలిటీలో గ్రామాలను కలిపితే తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోతారని, విపరీతమైన పన్నుల భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, సామాజిక సంఘాలు, కుల సంఘాలు ఏకమై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు కొత్త నర్సింహారెడ్డి, కొత్త మాణిక్‌రెడ్డి, రఫూఫ్, సురేందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు చాకలి అరవింద్ రజక, పరమేశ్, షాబాద్ ప్రవీణ్, రాజు, ఆసిఫ్, రవి, గునుగుర్తి చిన్న, అమీర్ తదితరులు ఉన్నారు.

## సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులు చరణ్ నాయక్, చంటి

ఫూడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ కబడ్డీ పోటీల్లో మండల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లాలో శుక్రవారం జరిగిన సీఎం కప్ కబడ్డీ పోటీల్లో పూడూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న చరణ్ నాయక్, రాకంచర్లకు చెందిన చంటి సీఎం కప్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. ఈ మేరకు ఈనెల 28వ తేదీన మహబూబ్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఈ ఇద్దరు విద్యార్థులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

## చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

**అరతులం బంగారం, రెండు వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**



మాట్లాడుతున్న ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్

మూడుచింతలపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను శామీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి అర్ధతులం బంగారం, రెండు వాహనాలతో పాటు సెల్ ఫోన్లలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ రాములు నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ నెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో వ్యవసాయ పొలం వద్ద ధాన్యం ఎండపోసేందుకు వెళ్తున్న మహిళ మెడలోంచి ఇద్దరు గుర్తుతెలియని దుండగులు పుస్తెలతాడు తెంచుకొని పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో శామీర్‌పేట్ పోలీసులు సీఐ శ్రీనాథ్ నేతృత్వంలో ఆరు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం సుమారు 70కిలోమీటర్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి 600 సీసీ కెమెరాలను పరిశీలించి ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నూనె అంజిరెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తూ కీసర మండలం బండ్లగూడలో నివాసముంటున్నాడు. ఐటీ కంపెనీలో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్న సమయంలో బోడుప్పల్‌కు చెందిన నరేందర్‌రెడ్డి అలియాస్ నవీన్‌రెడ్డి క్యాబ్ డ్రైవర్‌తో పరిచయం ఏర్పడి స్నేహితులుగా మారారు. నరేందర్‌రెడ్డి కారు కొనుగోలు చేసి అంజిరెడ్డిని డ్రైవర్‌గా పెట్టుకున్నాడు. ఇదిలాఉండగా అధిక సంపాదన లక్ష్యంగా ఈజీ మనీ కోసం చోరీల బాటపట్టారు. పథకం ప్రకారం చైన్ స్నాచింగ్ చేశారు. కారులో రెక్కీ నిర్వహించిన వీరు అదనుకోసం వేచి చూశారు. ఈనెల 10వ తేదీన మూడుచింతలపల్లిలో హరిహర దేవాలయం సమీపంలో వడ్లు ఎండపోసేందుకు గ్రామానికి చెందిన మహిళా నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో బైక్‌పై వచ్చి చైన్ స్నాచింగ్ చేశారు. మహిళ ప్రతిఘటించడంతో దాదాపు అర్ధతులం బంగారు చైన్‌తో పారిపోయారు. ఈ మేరకు ఇద్దరు నింధితులను పట్టుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి అరతులం బంగారం, రెండు వాహనాలు, సెల్‌ఫోన్లలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును తక్కువ సమయంలో ఛేదించిన సీఐ శ్రీనాథ్, సీసీఎస్ సీఐ నాయుడు, డీఐ గంగాధర్, ఎస్‌ఐలు హారిక, పరశురాం, దశరథ్, సిబ్బందిని ఏసీపీ రాములు అభినందించారు.

## ఏపీ జీవీబీ శాఖలు టీజీబీలో విలీనం

- ▸▸ ఈనెల 28 నుంచి 31వరకు గ్రామీణ బ్యాంకు లావాదేవీలు నిలిపివేత
- ▸▸ తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్రాంరెడ్డి


మాట్లాడుతున్న గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి

తాండూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం వారి ఉత్తర్వుల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(జీవీబీ) పరిధిలో ఉన్న తెలంగాణలోని ఐదు బ్రాంచ్‌లను జనవరి 1వ తేది నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం అవుతున్నాయని హైదరాబాద్ రీజియన్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. తాండూరు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్‌రావుతో శుక్రవారం కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పరిధిలో ఉన్న మెదక్, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, వరంగల్ బ్రాంచ్‌లను ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు పరిధిలోని వస్తాయని తెలిపారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం బ్రాంచ్‌లు మాత్రం ఆంధ్రప్రదేశ్, గ్రామీణవికాస్ బ్యాంకులుగానే కొనసాగుతాయని తెలిపారు. శాఖలు, వ్యవస్థల సులభ విలీనానికి శాఖ కార్యకలాపాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, యూపీఐ, ఏటీఎం, మొబైల్, బ్యాంకింగ్, రిటైల్మెంట్ బ్యాకింగ్, ఖాతాదారుల సేవా కేంద్రాలు ఈనెల 28వ తేదీ నుంచి 31 వరకు ఎలాంటి లావాదేవీలు ఉండవని తెలిపారు. తిరిగి బ్యాంకింగ్ సేవలు జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 54బ్రాంచ్‌లు ఉన్నాయని, రూ.1240కోట్ల డిపాజిట్లు ఉండగా రూ.1760కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు.

## ఆత్మరక్షణకు కరాటే దోహదం



ఆమనగల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహద పడుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యతోపాటు కరాటే నేర్చుకోవాలని సూచించారు. సీఎం కప్ క్రీడల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. తైక్వాండో కార్యదర్శి బాబు లాల్ తో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి కరాటే పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర స్థాయి టీంకు కరాటే విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కసిరెడ్డి బెల్టులు, బహుమతులు ప్రదానం చేశారు. నాయకులు పర్వత్‌రెడ్డి, సంజీవ్‌యాదవ్, మోతి లాల్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటయ్య, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## చేవెళ్ల ఆర్డీవో ఆఫీసులో ప్రతీ సోమవారం 'ప్రజావాణి'

చేవెళ్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్డీవో చంద్రకళ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు.

## ఆటో జేఏసీ నాయకుల ముందస్తు అరెస్టు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆటో కార్మికులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం నేపథ్యంలో స్థానిక ఆటో జేఏసీ నాయకులను శుక్రవారం ఇబ్రహీంపట్నంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో వేణుగోపాల్‌రావు, సద్గుణాచారి, రాములు, శ్రీనివాస్, వినోద్ తదితరులు ఉన్నారు.

# కంచె లేక ప్రాణాలు హరీ!

- నెల రోజుల్లోనే రెండు ప్రమాదాలు
- షార్ట్‌సర్క్యూట్‌తో ఎద్దు మృతి, వ్యక్తికి తీవ్రగాయాలు
- విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం

కొత్తూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పశువులు మేత మేయడానికి వెళ్లి అనుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళుతుండటంతో ప్రమాదాలు జరుగు తున్నాయి. దాంతో మృత్యువాత పడుతు న్నాయి. మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీకి వెళ్లే రోడ్డు పక్కన నెలకొని ఉన్న కంచలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. నెలరోజుల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు సంభవించాయి. ఓ కాడెద్దు మృతి చెందగా, మరో వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. ఈనెల 18న ఓ ఎద్దు మేత మేయడానికి వెళ్లి, కంచలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. నెల రోజుల క్రితం అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి కంచలేని విద్యుదాఘాతానికి గురై గాయాలతో బయటపడ్డాడు. ప్రాణసంకటంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు రోడ్డుపక్కనే కంచె లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో పోచమ్మ కాలనీతో పాటు, పలు కాలనీలు ఉండడంతో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు కూడా ఈ ప్రాంతం నుంచే పాఠశాలలకు వెళ్లి వస్తుంటారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రజలు బిక్కు బిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచెలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.





పోచమ్మ కాలనీ రోడ్డులో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుదాఘాతంతో మృతిచెందిన ఎద్దు (ఫైల్)

## క్రైం కార్నర్

### పూజ గదిలో చెలరేగిన మంటలు

- కాలిపోయిన సామగ్రి.. దీపం వెలిగించడంతో ఘటన

శంకర్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పూజగదిలో వెలిగించిన దీపం కిందపడి వస్తువులకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. దాంతో ఇంట్లో ఉన్న సామగ్రి కూడా కాలిపోవడంతో దాదాపు రూ.లక్ష నగదుతో పాటు విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. రావులపల్లి కలాన్ గ్రామానికి చెందిన గౌండ్ల మాధవి కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. కాగా, శుక్రవారం ఇంట్లో ఉన్న పూజగదిలో దీపం వెలిగించింది. ఆమె ముగ్గురు పిల్లలు పాఠశాలకు వెళ్లగా మాధవి కూలి పనికి వెళ్లింది. మధ్యాహ్నం ఇంట్లో మంటలు చెలరేగి పొగ వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి మాధవికి సమాచారమిచ్చి తలుపులు పగులగొట్టారు. నీళ్లు పోసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే అల్మారాతో పాటు విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇంటి ఖర్చుల కోసం దాచుకున్న డబ్బుతో పాటు వస్తువులు కాలిపోయాయని మాధవి రోదించింది. అయితే, మాధవి భర్త గత కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటినుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. ప్రభుత్వ ఆర్థికంగా ఆదుకోవాలని మాధవి కోరుతోంది.

### విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

కేశంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోమాల్‌పల్లిలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన నిదురం జంగయ్య ఆవులను మేపడానికి గ్రామ శివారులోని తాళ్లగడ్డకు తీసుకెళ్లాడు. ఓ ఆవు మేత మేసుకుంటూ కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడంతో కరెంటు తీగ తగలి విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు జంగయ్య కోరాడు.

### రివర్స్ తీస్తుండగా విద్యుత్ స్తంభానికి తాకిన స్కూల్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం

చేవెళ్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సును రివర్స్ తీస్తుండగా వెనకాల ఉన్న విద్యుత్ స్తంభానికి తాకింది. ఈ ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని చనువల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని సిల్వర్‌డేల్ స్కూల్‌కు చెందిన బస్సు శుక్రవారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకుని వారి గ్రామాల్లో దింపేందుకు బయలుదేరింది. ఈక్రమంలో చనువల్లిలో విద్యార్థులను దింపి వస్తుండగా.. డ్రైవర్ రివర్స్ తీస్తున్న క్రమంలో బస్సు వెనకాల ఉన్న విద్యుత్ స్తంభాన్ని తగిలింది. కాగా, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో కిందకు దిగారు. గ్రామస్తులు వచ్చి బస్సువద్ద ఆందోళనకు దిగారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందన్నారు. అనంతరం పోలీస్‌లకు సమాచారం అందించారు.

### బోల్తాపడిన డీసీఎం.. డ్రైవర్‌కు గాయాలు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి నాగార్జునసాగర్ ప్రధాన రహదారి కోహెడ క్రాసింగ్ సమీపంలో శుక్రవారం రాత్రి వడ్ల లోడ్‌తో వెళుతున్న డీసీఎం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో డ్రైవర్‌కు గాయాలైనాయి. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా గజ్వేల్ నుంచి ఇబ్రహీంపట్నం పరిధి పోచారం వద్ద ఉన్న వైష్ణవి రైస్‌మిల్‌కు వడ్ల లోడ్‌తో వస్తున్న డీసీఎం రాత్రి 9 గంటల ప్రాంతంలో కోహెడ క్రాసింగ్ సమీపంలో అదుపుతప్పి పడిపోయింది. దాంతో డ్రైవర్ శ్రీనుకు గాయాలైనాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

# అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

- ప్రజా సంఘాల, పార్టీల నాయకులు
- అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మల దహనం



మహేశ్వరం : తుక్కుగూడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేఎల్లార్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న నాయకులు

మహేశ్వరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకు ఎంతో మేలు చేసిన అంబేడ్కర్‌ను కీర్తించడం బీజేపీకి కంటగింపుగా మారిందని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలకు పాల్పడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పీసీసీ పిలుపు మేరకు శుక్రవారం తుక్కుగూడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, ఇస్రాయేలు, రఘుపతి, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జానకీరామ్, చిన్నారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

**కందుకూరు** : అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మండల కేంద్రంలో కాంగ్రెస్, ప్రతిపక్ష నాయకులు ధర్నాలు, నిరసనలు తెలియజేశారు. కాంగ్రెస్ కందుకూరు గ్రామ శాఖ అధ్యక్షుడు గాదె కుమార్, మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. బీఆర్‌ఎస్ ఎస్సీసెల్ మండల అధికార ప్రతినిధి మంద యాదగిరి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కులరాజకీయాలను పెంచి పోషిస్తున్నట్లు ఆరోపించారు. అమిత్‌షా కేంద్ర మంత్రిగా కొనసాగే అర్హతను కోల్పోయారని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేవారు. సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. నాయకులు కుమార్, బాల్‌రాజ్, శ్రీశైలం, సిద్దు, రాములు, తదితరులున్నారు.

**ఆమనగల్లు** : అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన దురుద్దేశ వ్యాఖ్యలపై ప్రజా సంఘాలు మండిపడ్డాయి. స్థానిక రాజీవ్ చౌక్ వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. అంబేడ్కర్-పూలే జ్ఞాన జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్యలు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న ఆలోచనలకు అనుగుణంగానే అమిత్ షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. దళిత ప్రజా సంఘాల నాయకుడు దామోదర్, సాయిలు, కొప్పు యాదయ్య, దుబ్బ చెన్నయ్య, పిప్పళ్ల శివశంకర్, జిల్లెల్ల పెంటయ్య, పోచయ్య, పట్నం నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్** : అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు, సమతా సైనిక్‌దళ్ మండలాధ్యక్షుడు దేశమళ్ళ కృష్ణ అన్నారు. షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆయన ఫొటోలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, శివశంకర్, బాల్‌రాజ్, నర్సింహులు, సుధాకర్, ప్రవీణ్ తదితరులున్నారు.

**చేవెళ్ల** : అంబేడ్కర్‌పై అమిత్‌షా వాఖ్యలకు నిరసనగా పట్టణ కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘాలు, అఖిల పక్షం పార్టీల నాయకులు నిరసన వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు. సున్నపు వసంతం, పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, పెద్దోళ్ల ప్రభాకర్. శ్రీనివాస్, రామస్వామి, దేవేందర్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, జహంగీర్, విజయ్, సురేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

**షాద్‌నగర్ అర్బన్** : పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని ప్రజా, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. షాద్‌నగర్ చౌరస్తాలో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, ఎన్‌పీఆర్‌డీ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మాల మహానాడు నాయకులు అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేయడానికి పూనుకోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అమిత్‌షాను కేంద్ర హోంశాఖ మంత్రి పదివి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు పి. శ్రీనునాయక్, శ్రీకాంత్, భుజంగారెడ్డి, కావలి రాజు, మైలారం జంగయ్య, జనార్దన్, వెంకట య్య, బుచ్చయ్య, అర్జున్, రామకృష్ణ, దార లింగం, రామ్మూర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**యాచారం** : అంబేడ్కర్‌ను విమర్శించిన అమిత్ షాను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. డి.మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, పి. యాదయ్య, చందూనాయక్, అలంపల్లి నర్సింహ, ఆలంపల్లి జంగయ్య, తదితరులున్నారు.

**ఇబ్రహీంపట్నం** : అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఐటీయూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి సీహెచ్ ఎల్లేష్, ప్రజా సంఘాల నాయకులు బుగ్గరాములు, చరణ్, శ్రీకాంత్, రాఘవేందర్, ముసలయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**మంచాల** : రాజ్యాంగాన్ని అవమానపర్చిన అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.యాదయ్య కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మండల కార్యదర్శి రావుల జంగయ్య, బుగ్గరాములు, స్వామి, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## పేదల పక్షాన నిరంతర పోరాటం : సీపీఐ



చేవెళ్ల : జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల/కేశంపేట/శంకర్‌పల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ పేదల పక్షాన నిరంతరం పోరాడుతుందని, పార్టీ ఆవిర్భవించి వందేళ్లు కావస్తున్న సందర్భంగా అన్ని గ్రామాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు. పట్టణ కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణాచారి, జిల్లా అధ్యక్షుడు అంజయ్య, చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు ప్రభాకర్, మోహన్‌రెడ్డి, బాలరాజ్ గౌడ్, వెంకటేశ్, నర్సింలు, రాములు, తదితరులున్నారు. సీపీఐ శతవసంతోత్సవాలను ఘనంగా నిర్వహించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రామచంద్రయ్య, పారేశా, నర్సింహ, కమలమ్మ తదితరులున్నారు. అలాగే అణగారిన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిన ఘనత భారత కమ్యూనిస్టు పార్టీకే దక్కిందని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తెలిపారు. సీపీఐ ఆవిర్భావం దినం సందర్భంగా వందేళ్ల ఉత్సవాలను పురస్కరించుకుని శంకర్‌పల్లిలోని గెస్టుహౌస్‌లో జిల్లా కార్యవర్గసభ్యుడు ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శితో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. మండల కార్యదర్శి సుధీర్, నాయకులు తదితరులున్నారు.

## సీపీఎం మండల కార్యదర్శిగా ఆలంపల్లి నర్సింహ



యాచారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం యాచారం మండల కార్యదర్శిగా మేడిపల్లికి చెందిన ఆలంపల్లి నర్సింహ ఎన్నికయ్యారు. కాగా, నర్సింహ రెండోసారి ఏకగ్రీవంగా ఎంపిక కావడంతో పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు ఆయనకు శుక్రవారం శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకులు ఆయన్ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

## సింహగర్జన సభను జయప్రదం చేయాలి

కేశంపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించే లంబాడ సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్(లంబాడ హక్కుల పోరట సమితి) కేశంపేట మండలాధ్యక్షుడు జర్పుల రాజు నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల స్థాయి పూర్తి కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాట్రావత్ రాంచందర్, మూడవత్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా వడ్య శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కరంతోట్ నారాయణ, మూడావత్ అంజి, కోశాధికారిగా కాట్రావత్ దేవుజా, కమిటీ సభ్యులుగా దస్రునాయక్, జయరాం నాయక్, రవి నాయక్, రాజు నాయక్, లక్యా నాయక్, శ్రీను నాయక్‌లను ఎన్నుకున్నారు.

## 'పిరమిడ్'ను పరిశీలించిన శంషాబాద్ డీసీపీ



ఏర్పాట్లపై డీసీపీకి వివరిస్తున్న పిరమిడ్ ట్రస్ట్ కో-ఆర్డినేటర్ మాధవి

కడ్తాల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకల నేపథ్యంలో మండలంలోని అన్మాస్‌పల్లి మహేశ్వర మహా పిరమిడ్‌ను శుక్రవారం సాయంత్రం శంషాబాద్ డీసీపీ రాజేశ్ సందర్శించారు. సీఐ శివప్రసాద్, ఎస్సై వరప్రసాద్‌లతో కలిసి పిరమిడ్ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లును పరిశీలించారు. ఏర్పాట్ల గురించి పిరమిడ్ కో-ఆర్డినేటర్ మాధవి డీసీపీకి వివరించారు. పిరమిడ్ చుట్టూ అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు డీసీపీ సూచించారు.

## ప్రతీ ఒక్కరు వైద్యపరీక్షలు చేయించుకోవాలి



ఏసీపీ రంగస్వామికి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు తప్పని సరిగి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు, వాళ్ల కుటుంబ సభ్యులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్విహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం శిబిరం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఏసీపీ ప్రారంభించారు. ఆయన బీపీ, ఇతర పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పీసీసీ అధ్యక్షుడికి సన్మానం



పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

చేవెళ్ల, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పీసీసీ సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించినట్లు బి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, పలుగుట్ట మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కొందుర్గు తహసీల్దార్ జగదీశ్వర్

చౌదరిగూడ,డిసెంబరు 20 ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కొందుర్గు తహసీల్దార్ రమేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కొందుర్గు మండల కేంద్రంలోని ఎస్సీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంటగది పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు.

## దర్గా అభివృద్ధికి కృషి



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భీంభరత్, సురేందర్‌రెడ్డి

షాబాద్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): షాబాద్ పహిల్వాన్ షావలీ దర్గా అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ కార్యదర్శి పీసరి సు రేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. నాయకులు రాంరెడ్డి, మాధవరెడ్డి, చంద్రయ్య, రాహుల్ గుప్తా, పెంటారెడ్డి, నర్సింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

ఆమనగల్లు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం కావాలని మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ ఛైర్మన్ దుర్గయ్యలు పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాంపాల్ నాయక్, దుర్గయ్య, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్‌లు హాజరయ్యారు. పార్టీ బలోపేతం, భూత్ కమిటీ ఎన్నికలు , ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించారు. 178వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా సముద్రాల వెంకటేశ్, మీడియా కన్వీనర్‌గా బంటి, బూత్‌లెవల్ ఏజెంట్‌గా వినయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారికి ఎన్నిక పత్రాలను అందజేసి అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బైకని శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్‌ఎఫ్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. మండలంలోని సరస్వతిగూడ, ముచ్చర్ల, ఆకులమైలారం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తుక్కుగూడలోని కార్యాలయంలో అందజేశారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలను మంజూరు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

## సంక్షిప్తంగా..

**యాచారం** : ఇంధనాన్ని చాలా పొదుపుగా వాడాలని, సోలార్ పవర్ వాడితే వాతావరణ కాలుష్యం కూడా నివారించుకోవడం చాలా సులువని రంగారెడ్డి జిల్లా ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ ప్రతినిధి సురేష్‌రెడ్డి అన్నారు. ఇంధన వనరుల వారోత్సవాల సందర్భంగా యాచారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇంధనం వాడకం తగ్గించుకుంటే కలిగే లాభాలపై నిర్వహించిన పెయింటింగ్ పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

**తలకొండపల్లి** : సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో ఏర్పాటు చేసిన పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు కాంగ్రెస్ మండల నాయకుడు తుమ్మ నర్సింహ శుక్రవారం క్రీడా దుస్తులను సమకూర్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక నాయకులతో కలిసి విద్యార్థులు , యువకులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్** : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. కొమరబండకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. నాయకులు బర్ల యాదయ్య, సుభాష్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

**శంకర్‌పల్లి** : కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం తగదని చేవెళ్ల నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రంగయ్యగారి శ్రీనివాస్ అన్నారు. శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేటీఆర్‌పై కేసులు పెట్టి వేధించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు.

**ఆమనగల్లు** : అర్హులైన నిరుపేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేయాలని ఆమనగల్లు మున్సిపల్‌కౌన్సిలర్ రాదమ్మవెంకటయ్య అన్నారు. ఆమనగల్లు మున్సిపల్ 8వ వార్డు సంకటోనిపల్లిలో ఇళ్ల సర్వేను పరిశీలించారు. వార్డు అధికారి ఎల్లయ్య, నాయకులు తదితరులున్నారు.

**ఆమనగల్లు** : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీలో నిర్వహించిన వజ్రోత్సవాల్లో శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, విశ్రాంత ఎస్ఈ రవీందర్ రెడ్డిలు పాల్గొన్నారు. రైతులతో కలిసి స్టాల్స్‌ను పరిశీలించారు. ఆధునిక వంగడాలు, విత్తన ప్రదర్శనను తిలకించారు.

**తలకొండపల్లి** : బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్‌ను యాదవ సంఘం నాయకులు పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ యాదవ్ తండ్రి జంగయ్య యాదవ్ మృతిచెందాడు. అఖిల భారత యాదవ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు లాలు యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు వెల్జాలకు చేరుకొని జంగయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు తిరుపతి యాదవ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లు** : రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డిని శుక్రవారం తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామ కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పరంగా కృషి చేయాలని కోరారు. వెంకట్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, అంబాజీ, అంజయ్య, అజీజ్, ఆరీఫ్, అశోక్‌బాబు, రాజు, తదితరులు ఉన్నారు.

**చేవెళ్ల** : మూడు రోజుల క్రితం మండల పరిధిలోని తంగడ్‌పల్లి శివారులో మడికట్టు గ్రామానికి చెందిన పోచయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్ మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సాయం చేయగా చేవెళ్లలో అందించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చేవెళ్ల పోలీస్‌లకు సూచించారు. తంగడ్‌పల్లి నాయకులు రాములుగౌడ్, సత్యంగౌడ్ తదితరులు ఉన్నారు.

**కందుకూరు** : కొత్తూరుకు చెందిన 40మంది యువకులు అయ్యప్ప మాలను ధరించారు. వారికి మండటంలోని మహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన ఎండీ ఆసిఫ్ జానీ శుక్రవారం వారికి అన్నప్రసాద వితరణ చేశారు. ఆయనను అయ్యప్ప భక్తులు సన్మానించారు. గురుస్వాములు ఏ.కుమార్, ఎం.రవీందర్, ప్రభాకర్, చెన్నకేశ్వర్, జ్ఞానేశ్వర్, బాబుగౌడ్, డి.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ రూరల్** : ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలలో శుక్రవారం బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు రెండో రోజు కొనసాగాయి. రాష్ట్రంలోని ఏడు జోన్ల నుంచి అండర్ 14, 17, 19 విభాగాలలో పోటీలు జరుగుతున్నాయి. 1190 మంది విద్యార్థినులు పాల్గొంటున్నట్లు మల్టీ జోనల్ - 2 ఆఫీసర్ రజిని తెలిపారు.

**కేశంపేట** : గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఇన్‌చార్జీ ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. గ్లోబల్ పాఠశాలలో వార్షిక క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కరస్పాండెంట్ రామకృష్ణ చారి, డైరెక్టర్ మౌనిక మాజీ సర్పంచ్ అమృతమ్మ, మాజీ ఎంపీటీసీ యాదయ్యచారి, విద్యార్థుల తల్లితండ్రులున్నారు.

**కేశంపేట** : కేశంపేట మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగంగా కొనసాగుతోంది. ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీడీ కిష్టయ్యలు కొనాయపల్లి, సంతాపూర్, కొత్తపేట, బొదునంపల్లి, లేమామిడి, నిర్దవెల్లి, కాకునూర్, సుందరాపూర్, వేముల్‌నర్వ, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

**మంచాల** : కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణలో అరాచకం రాజ్యమేలుతోందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చీరాల రమేష్ ఆరోపించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ పుల్లారెడ్డి, మాజీ వైస్‌ఛైర్మన్ రవి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరుగ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలు అమలు చేస్తామంటూ మోసం చేసిందని దుయ్యబట్టారు. కేటీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసులు పెడుతున్నారన్నారు.

## పేదలకు ఉచితంగా వైద్యం అందించాలి



మందులు అందజేస్తున్న గంప వెంకటేశ్, దశరథ్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్యులు ముందుకు రావాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్‌లు అన్నారు. ఎక్వాయిపల్లిలో శుక్రవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ ట్రస్ట్, గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రైతు సమన్వయ సమితి మండల కో-ఆర్డినేటర్ వీరయ్యతో కలిసి వారు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఉప్పల అఖిల్, ఉప్పల అనిల్, భావనల ఆధ్వర్యంలోని 333 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

తలకొండపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోయి గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ మండలాధ్యక్షుడు తిరుమణి రవిగౌడ్ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. చీపునుంతలలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 23వ బూత్ కమిటీ అధ్యక్షుడిగా వస్పుల రమేశ్, గౌరవాధ్యక్షుడిగా పసునూరి బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా మొగిళ్ల దశరథంలు ఎన్నికయ్యారు. అనంతరం వారిని సత్కరించి ఎన్నిక పత్రాన్ని అందజేశారు. దళిత మోర్చా మండలాధ్యక్షుడు మల్లేశ్, బీజేపీ సీనియర్ నాయకులు మహేశ్, పరమేశ్, తదితరులున్నారు.